

# రోమ్‌లో రోమన్‌లా...!

దమయంతికి నిద్ర పట్టడంలేదు. హాల్లోకి వెళ్ళి వాల్‌క్లాక్ వైపు చూసింది. పదకొండు అయింది. దీర్ఘంగా నిట్టూర్చి వెళ్ళి పడుకుంది.

"ఏంటే నిద్రపట్టడంలేదా?" భార్యను అడిగాడు రామారావు.

"ఔనండీ హరి ఇంకా, రాలేదు. ఇప్పుడు పదకొండు అయింది" అంది దమయంతి.

"వస్తాడ్లే చిన్న పిల్లవాడా ఏం?"

"అది కాదండీ. రోడ్ల మీద ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. రోజూ ఎన్నో యాక్సిడెంట్లు అవుతున్నాయి. ఎక్కువగా స్కూటర్ల మీద వెళ్ళే వాళ్ళకే జరుగుతున్నాయి. లారీ స్కూటర్ని గుద్దిందనో, నీళ్ళ ట్యాంకర్ కింద బైక్ పడిందనో ! వీడిని బస్‌లో వెళ్ళమంటే వినడు. టైమ్‌కి ఆఫీసుకు వెళ్ళడం కుదరదు అంటాడు. వాడొచ్చేదాకా నాకు భయంగానే వుంటుందండీ. నిద్రపట్టదు" దిగులుగా అంది దమయంతి.

"అలా భయపడితే సిటీలో ఉండలేం. ఎప్పుడేం జరుగుతుందో తెలీదు. జరిగేదాన్ని ఎవ్వరూ ఆపలేరు. అనవసరమైన ఆలోచనలు రానీయకు. దేవుడిమీద భారం వేసి నిశ్చింతగా ఉండు. హాయిగా నిద్రపో" భార్యకి ధైర్యం చెప్పాడు రామారావు.

"అది కాదండీ. వీడు తరచుగా ఆలస్యంగా వస్తున్నాడు. పాడు అలవాట్లు చేసుకుంటున్నాడని అనుమానంగా ఉంది. ఆలస్యంగా వచ్చినప్పుడల్లా 'తినొచ్చాన్లే అమ్మా' అంటున్నాడు."

రామారావు మాట్లాడలేదు. దమయంతి ఏదో చెప్తోంది. కాసేపటికి కాలింగ్ బెల్ మోగింది. దమయంతి వెళ్ళి తలుపుతీసింది. హరి నుంచి ఆల్కాహాల్ వాసన గుప్పుమంది. ఆమె ముక్కుమూసుకుంది. హరి చిన్నగా నవ్వాడు. దమయంతి కొడుకువైపు కోపంగా చూసి "తాగొచ్చావా? ఛీ...ఏం పాడు అలవాట్లురా" అంది.

"అలవాటేం కాదమ్మా. మా ఆఫీసులో కొలీగ్స్ అప్పుడప్పుడూ పార్టీలు చేసుకుంటారు. వెళ్ళకపోతే బాగుండదు" అన్నాడు.

"ఛీ...ఛీ...ఇటువంటివి మన ఇంటావంటా లేవు. మీ నాన్నగారు ఎన్నేళ్ళ నుంచి ఉద్యోగం చేస్తున్నారు. ఎప్పుడైనా తాగొచ్చారా?"

"ఆ రోజులు వేరమ్మా. ఇప్పుడంతా మారిపోయింది. ఆడవాళ్ళు కూడా తాగుతున్నారు. నలుగురితోపాటు నారాయణ, రోమ్‌లో ఉన్నప్పుడు రోమన్‌లా ఉండమన్నారు. సిటీలో ఉన్నప్పుడు తప్పదు" అన్నాడు హరి.

దమయంతి సణుక్కుంటూ వచ్చి పడుకుంది.

"ఏమంటున్నాడు నీ ముద్దుల కొడుకు?" అడిగాడు రామారావు.

"తాగొచ్చాడు. అదేమంటే రోమ్‌లో వున్నప్పుడు రోమన్‌లా ఉండాలిట" రామారావు ఏం మాట్లాడలేదు.

"మాట్లాడరేం?" అంది దమయంతి.

"ఏం మాట్లాడను"

"చెడు అలవాట్లు చేసుకుంటుంటే మందలించరేం?"

"అద్దాలనాడు బిడ్డలుగాని గడ్డాలనాడు కాదని పెద్దవాళ్ళు వూరికే అనలేదు. చెప్పాడుగా రోమ్‌లో రోమ్‌లా ఉండాలని. మన మాటలు లక్ష్యపెడతాడా? అందులోనూ ఉద్యోగస్థుడు" అని నిట్టూర్చాడు రామారావు.

"మొక్కై వంగనిది మానై వంగుతుందా అని. ఇప్పుడు మీరేం మాట్లాడకుండా ఉంటే ఎలా?" అన్నది దమయంతి.

"ఇప్పుడు వాడు మొక్క కాదు, మానే" అన్నాడు రామారావు.

★ ★ ★

ఒక రోజు తన బైక్ మీద ఎక్కించుకుని ఒకమ్మాయిని ఇంటికి తీసుకు వచ్చాడు. అప్పుడు దమయంతి వరండాలోనే కూర్చుని బియ్యంలో వడ్లగింజలు ఏరుతూ ఉంది. ఆమెను చూసి తెల్లబోయింది దమయంతి.

ఆమె చామనఛాయతో ఎత్తుగా ఉంది. లైట్ బ్లూ కలర్ చీర కట్టుకుని హరి వెనుకే నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వచ్చింది.

"అమ్మా ! ఈమె జూలీ. మా ఆఫీసులోనే పనిచేస్తోంది" అన్నాడు హరి తెల్లబోయి చూస్తున్న తల్లితో.

"నమస్తే ఆంటీ" అన్నది జూలీ నవ్వు ముఖంతో.

హరి జూలీని తన రూమ్‌లోకి తీసుకువెళ్ళి కూర్చోబెట్టాడు. దమయంతి గుండెలో రాయి పడినట్లయింది. పేరులోనే తెలుస్తోంది. ఆమె క్రిస్టియన్ అని. కొంపదీసి ఆ అమ్మాయిని ప్రేమించాను, పెళ్ళి చేసుకుంటాను అని చెప్పడు కదా? అనుకుంది. అనుమానంతోనే ఆమె ఇంట్లోకి నడిచింది.

హరి జూలీని తీసుకువెళ్ళి తండ్రికి పరిచయం చేశాడు. రామారావు నిర్లిప్తంగా వుండిపోయాడు. తరువాత హాల్లో కూర్చుని టీవీ చూస్తున్న జూలీకి కాఫీ కప్పు అందించింది దమయంతి.

"థాంక్స్ ఆంటీ" అంది జూలీ.

"కాఫీ చాలా బాగుంది ఆంటీ" అని మెచ్చుకుంది.

"మా అమ్మ చేతివంట బావుంటుంది జూలీ" అన్నాడు హరి నవ్వుతూ.

"అలాగా ! ఆంటీ మీ దగ్గర వంట చేయడం నేర్చుకుంటాను" ముసిముసిగా నవ్వుతూ అంది జూలీ.

"నేర్చుకుంటానంటున్నావు. నీకు వంట రాదా?" అడిగింది దమయంతి. తల అడ్డంగా వూపింది జూలీ.

"ఆ ఛాన్సేలేదు ఆంటీ. మా డాడీ ఇంజనీర్. మమ్మీ లెక్చరర్. మమ్మీ కూడా వంట చేయదు. కుక్ చేస్తుంది. అందుకే నాకు రాదు" చెప్పింది జూలీ.

"జూలీ ! ఈ రోజు నువ్వు మా అమ్మ చేతి వంట రుచి చూడాల్సిందే" ఆమె చేతిని నొక్కుతూ అన్నాడు హరి.

"ష్యూర్...ఆంటీ ఎలా వంట చేస్తుందో అబ్జర్వ్ చేస్తాను" అన్నది జూలీ.

తరువాత దమయంతితోపాటే వంట గదిలోకి వెళ్ళింది జూలీ. ఆమె వంట చేస్తుంటే కబుర్లు చెప్పింది. దమయంతి ఆమె కుటుంబం గురించి వివరాలు తెలుసుకుంది. లంచ్ తరువాత జూలీని బైక్‌మీద కూర్చోబెట్టుకుని వెళ్ళాడు హరి.

★ ★ ★

"ఏమండీ... నాకు భయంగా ఉందండీ" అంది దమయంతి రామారావు దగ్గరికి వచ్చి కూర్చుని.

"ఎందుకూ?"

"హరి ఆ పిల్లని పెళ్ళిచేసుకుంటానంటాడేమోనని?" అంది దిగులుపడుతూ. ఆమె ముఖంలో ఆందోళన వ్యక్తమవుతోంది.

"ఇంకా నీకు సందేహం ఎందుకు? ఆ పిల్లని ఇంటికి తెచ్చి మనకి పరిచయం చేసింది ఎందుకనుకున్నావు? వాడు ఆ పిల్లని లవ్ చేస్తున్నాడు. పెళ్ళి కూడా చేసుకుంటాడు" అన్నాడు రామారావు.

"మన కులం కాదు, మన మతంకాదు. అటువంటిదాన్ని కోడలిగా తెస్తానంటే చూస్తూ ఊరుకుంటామా?" ఆవేశపడుతూ అన్నది దమయంతి. ఆమె ముఖం ఎర్రగా కందిపోయింది.

"ఊరుకోక చేసేదేముంది?" నిట్టూరుస్తూ అన్నాడు రామారావు.

దమయంతి గొణుక్కుంటూ కూర్చుంది. అయినా హరి జూలీని కేవలం ఫ్రెండ్‌గా భావిస్తున్నాడేమో? పెళ్ళివరకూ వెళ్ళలేదేమో వ్యవహారం. తాము అనవసరంగా అనుమానిస్తున్నారేమో?" ఆమెలో ఏదో ఆశ.

మర్నాడు హరి సూటిగా చెప్పేసాడు.

"నాన్నా ! జూలీని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను"

రామారావు తలవూపి వూరుకున్నాడు. దమయంతి మాత్రం మండిపడింది.

"సిగ్గూసెరం లేదురా నీకు? ఆ పిల్లని చేసుకుంటావా? చుట్టాల్లో మా పరువు తీస్తావా? నీకేంపోయేకాలం వచ్చింది?" అంటూ అనరాని మాటల అంది. హరి కూడా సీరియస్‌గా చెప్పాడు.

"అమ్మా ! నీవన్నీ పాత చింతకాయ పచ్చడి మాటలు. లోకం అంతా మారిపోతున్నది. సౌకర్యాలు ముఖ్యం. కులం, మతం కాదు. జూలీని పెళ్లిచేసుకుంటే హేపీగా ఉంటుంది. మిడిల్‌క్లాస్ దరిద్రంలోంచి బైటపడవచ్చు. ఇద్దరికీ జీతాలు వస్తాయి. నీకు అదంతా అర్థం కాదు"

"నాకు ఏం అర్థం అయినా కాకపోయినా ఆ పిల్లని కోడలిగా ఒప్పుకోను. ఇంట్లో అడుగుపెట్టనీయను" ఆవేశంతో అంది దమయంతి.

"పోన్లేమ్మా మేమే వేరే వుంటాం" అన్నాడు హరి.

తర్వాత కల్చర్ గురించి లెక్చర్ దంచాడు. రోమ్‌లో రోమన్‌లా ఉండాలన్నాడు. జనం అంతా యూరోపియన్ కల్చర్ అలవర్చుకుని బాగుపడుతుంటే మనం బావిలో కప్పల్లా ఏడుస్తున్నాం అన్నాడు.

హరి జూలీని రిజిష్టర్ మ్యారేజీ చేసుకున్నాడు. రామారావు పెళ్ళికి వెళ్లాడుగానీ దమయంతి మాత్రం ససేమిలా అన్నది. హరి వేరే కాపురం పెట్టాడు.

★ ★ ★

రెండేళ్ళు గడిచాయి. ఒకరోజు హరి ఇంటికి వచ్చాడు.

"నాన్నా ! ఆర్థికమాంద్యంవల్ల జూలీకి జాబ్‌పోయింది. నాకు జీతం తగ్గించారు" అన్నాడు. రామారావు తలూపాడు.

"బ్యాంక్ లోన్ తీసుకుని ఫ్లాట్ కొన్నాంకదా. ఇప్పుడు లోన్ ఇన్‌స్టాల్‌మెంట్ కట్టలేక పోతున్నాం. బ్యాంక్ వాళ్ళు వేలం వేస్తామని నోటీసులిచ్చారు"

రామారావు వింటూ కూర్చున్నాడు.

"నాన్నా ! మన వూళ్ళో పొలం అమ్మేసి దాంతో బ్యాంక్ లోన్ కట్టేస్తే బావుంటుంది" అన్నాడు హరి.

"చూడు హరీ ! నువ్వు మాటమాటకీ రోమ్‌లో రోమన్‌లా ఉండాలని పాట పాడావు. యూరోపియన్ కల్చర్ గొప్పని మురిసిపోయావు మంచిదే. ఐతే నువ్వొక విషయం తెలుసుకోవాలి. యూరోపియన్ యువత తల్లిండ్రుల సంపాదన మీద ఆస్తులమీద ఆధారపడరు. ఆశ పడరు. స్వంత కాళ్ళమీద స్వతంత్రంగా జీవించడానికి చూస్తారు. నువ్వు రోమన్‌లాగే వుండు. మమ్మల్నిలా వదిలెయ్" కూల్‌గా చెప్పాడు రామారావు.

హరి ముఖంలో నెత్తురుచుక్క లేదు.

*–ఆంధ్రభూమి మాసపత్రిక, సెప్టెంబర్, 2009*